ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 28 జూన్ 2024



ఏపీ ఎడ్‌సెట్‌లో చంద్రిక ప్రతిభ

- స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన 'పేట' విద్యార్థిని


కాశిన వీరసాయి చంద్రిక

పాయకరావుపేట, జూన్ 27: ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల్లో పాయకరావుపేటకు చెందిన కాశిన వీరసాయి చంద్రిక రాష్ట్ర స్థాయిలో భౌతిక శాస్త్రంలో మొదటి ర్యాంకు సాధించింది. స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో డిగ్రీ వరకు చదువుకున్న ఆమె అనంతరం మద్రాసు ఐఐటీలో ఎంఎస్సీ చదువుకున్నారు. ఈ ఏడాది నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష రాసిన ఆమె గురువారం ప్రకటించిన ఫలితాల్లో ఫిజిక్స్ మెథడాలజీలో మొదటి ర్యాంకు సాధించింది.

సచివాలయాల్లో సర్వర్ డౌన్

- ధ్రువ పత్రాల జారీలో జాప్యం
- విద్యార్థుల అవస్థలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయాల్లో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు వెళుతున్న విద్యార్థులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. కళాశాలల్లో ప్రవేశాలకు గడువు సమీపిస్తున్నా ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళ చెందుతున్నారు.


అనకాపల్లి వుడ్‌పేటలోని ఓ సచివాలయంలో సర్వర్ మొరాయించడంతో వేచి ఉన్న దృశ్యం

జిల్లాలో 522 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో విద్యార్థులకు అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువపత్రాలను జారీ చేయాల్సి ఉంది. కాగా ఇటీవల ఎన్నికల బిజీలో ఉన్న సచివాలయాల సిబ్బంది ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను ఆలస్యంగా ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికలు జరగడం, కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో గత వైసీపీ ప్రభుత్వ లోగోలు, జగన్ ఫొటోలు వున్న పోర్టల్‌లో మార్పులు చేశారు. ఈ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ వరకు సాగింది. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ప్రారంభించారు. అప్పటికే దాదాపు అన్ని సచివాలయాల పరిధిలో విద్యార్థుల కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు పేరుకుపోయాయి. సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ నిత్యం సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి. మరోవైపు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ నిత్యం తిరుగుతున్నా సర్వర్‌లు పనిచేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇటీవల సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదు. సచివాలయంలో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత ఆన్‌లైన్‌లో మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ లాగిన్‌కు వెళుతుంది. ఆయన ఓకే చేసిన తరువాత తహసీల్దారు డిజిటల్ సైన్ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయిన తరువాతే సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు డౌన్‌లోడ్ అవుతాయి. సచివాలయాల్లో నిత్యం సర్వర్ డౌన్‌లో ఉండడం, ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు డౌన్‌లోడ్ కావడం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో గురువారం పలు సచివాలయాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గంటల సమయం వెచ్చించి కంప్యూటర్‌పై ప్రయత్నిస్తే ఒకటి, రెండు ధ్రువీకరణ పత్రాలు మాత్రమే డౌన్‌లోడ్ అవుతున్నాయని, దీంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. నిత్యం సర్వర్లు మొరాయిస్తుండడంతో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేమని సచివాలయ డిజిటల్ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ అయినా మండల తహసీల్దారు కార్యాలయాల్లో డిజిటల్ సైన్ అవ్వకపోవడంతో మరికొందరు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వారం రోజులుగా అనకాపల్లి మండల తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావు సెలవులో ఉండడంతో కశింకోట తహసీల్దారుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు చోట్ల న్యాయం చేయలేకపోతున్నారు. ధ్రువీకరణ పత్రాలు ఈ నెల 30వ తేదీలోగా కళాశాలల యాజమాన్యాలకు అందజేయలేక పోతే తాము కళాశాలల్లో చేరే అవకాశం కోల్పోవాల్సి వస్తుందేమోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను జిల్లా సచివాలయాల నిర్వహణాధికారి మంజులవాణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా సచివాలయాల్లో ఇంటర్నెట్, సర్వర్‌లు మొరాయించడంపై ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిపై కలెక్టర్‌కు నివేదించి సరి చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

పీజీ సెట్‌లో మెరిశారు

- జిల్లాలో పలువురు విద్యార్థులకు ఉన్నత ర్యాంకులు

అనకాపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. రాష్ట్ర స్థాయిలో ఏయూ ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. పాయకరావుపేటకు చెందిన హర్షశ్రీ లైఫ్ సైన్స్‌లో 4వ ర్యాంకు, బుచ్చెయ్యపేట మండలం తైపురానికి చెందిన యాదగిరి సురేశ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 5వ ర్యాంకు సాధించారు. జియాలజికల్ సైన్స్‌లో చోడవరం మండలం నర్సయ్యపేట గ్రామానికి చెందిన ఉగ్గిన సౌమ్య 5వ ర్యాంకు, హిస్టరీ సబ్జెక్టులో నర్సీపట్నానికి చెందిన రెడ్డి మోహన్ 3వ ర్యాంకు, జనరల్ సబ్జెక్టులో చీడికాడకు చెందిన మాదాసు కోటి అప్పారావు 12వ ర్యాంకు, జియోగ్రఫీలో నర్సీపట్నానికి చెందిన సోమిరెడ్డి వినోద్‌కుమార్ 2వ ర్యాంకు సాధించారు. ఇదే విభాగంలో గొలుగొండ మండలం ఏఎల్ పురానికి చెందిన గొంప రాజుబాబు 3వ ర్యాంకు, ఇంగ్లీష్ లెటరేచర్ విభాగంలో నాతవరానికి చెందిన సమరాల స్పందన 4వ ర్యాంకు, బోటనీ పీజీ కోర్సులో సబ్బవరం మండలం తవ్వవానిపాలేనికి చెందిన బాకం లీలావతి 3వ ర్యాంకు పొందారు. కెమికల్ సైన్స్ పీజీ కోర్సులో నక్కపల్లి మండలం ఉద్దండపురానికి చెందిన పొడగట్ల వెంకట సత్యనారాయణ 4వ ర్యాంకు, ఎకనమిక్స్ పీజీ విభాగంలో నర్సీపట్నం కాపువీధికి చెందిన షేక్ సమీర్ ... మిగతా 8వ పేజీలో

యూపీఎస్సీ ర్యాంకు సాధించడమే లక్ష్యం



మాది నర్సీపట్నంలోని కాపువీధి. నాన్న రాము ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ రత్నం గృహిణి. ప్రాథమిక విద్య, పదో తరగతి, ఇంటర్ వరకు నర్సీపట్నంలో చదివా. డిగ్రీ బీఏ (ఎకనామిక్స్, హిస్టరీ, జాగ్రఫీ) విశాఖపట్నం బుల్లయ్య కళాశాలలో పూర్తి చేశా. పీజీ సెట్ జాగ్రఫీలో స్టేట్ రెండో ర్యాంకు, ఎకనామిక్స్‌లో నాలుగో ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. గ్రూప్-2 మెయిన్స్‌కి ప్రిపేర్ అవుతున్నా. యూపీఎస్సీలో ర్యాంకు సాధించమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

- సోమిరెడ్డి వినోద్‌కుమార్,
జాగ్రఫీలో రెండో ర్యాంకు

పల్లెలకు జ్వరమొచ్చింది

మలేరియా, వైరల్ జ్వరాలతో ఆస్పత్రి పాలవుతున్న ప్రజలు

- నియోజకవర్గంలో 3,073 మంది జ్వర బాధితులు
- ఏడుగురికి మలేరియా, ఒకరికి డెంగ్యూ
- జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిట


ఏరియా ఆస్పత్రి వార్డులో జ్వర పీడితులు

నర్సీపట్నం, జూన్ 27: **జ్వరాలతో పల్లెలు వణికిపోతున్నాయి. వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగ్యూతో ప్రజలు ఆస్పత్రిలో చేరుతున్నారు. ప్రాంతీయ ఆస్పత్రి, పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలలో రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. డయేరియా, మలేరియా కేసులు అధికంగా వస్తున్నాయని ప్రైవేటు వైద్యులు తెలిపారు.**

గత ఐదారు సంవత్సరాల కంటే ఈ ఏడాది మలేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని వైద్యులు తెలిపారు. ఇటీవల వర్షాలు పడుతుండడం, క్షీణించిన పారిశుధ్యం, దోమల బెడద వల్ల జ్వర పీడితులు రోజు రోజుకి పెరిగిపోతున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో నెల రోజుల వ్యవధిలో వైరల్ జ్వరాలతో 570 మంది రోగులు వైద్యం చేయించుకున్నారు. నియోజకవర్గంలోని గొలుగొండ, కృష్ణాదేవిపేట, చీడిగుమ్మల, నాతవరం, గుణిపూడి, మాకవరపాలెం, బూరుగుపాలెం, వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, నర్సీపట్నం అర్బన్ పీహెచ్‌సీలలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 26 వరకు 3,073 మంది జ్వరాలతో చికిత్స పొందారు. అదే విధంగా ఏడుగురు మలేరియా, ఒకరు డెంగ్యూతో చికిత్స చేయించుకున్నారు. ఏరియా ఆస్పత్రి ఇన్‌పేషెంట్స్ వార్డులో చికిత్స పొందుతున్న వారిలో గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంకి చెందిన మాకిరెడ్డి వెంకటరమణ తీవ్రమైన జ్వరంతో బుధవారం ఆస్పత్రిలో చేరారు. రావికమతం మండలం కొట్నాపల్లికి చెందిన వంతల అప్పలరత్నం గత రెండు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స ... మిగతా 8వ పేజీలో


ఏరియా ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగులు

ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. కాచి వడబోసిన నీరు తాగాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమ కాటుకి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తీవ్రమైన చలి జ్వరం, ఒంటి నొప్పులు ఉంటే అశ్రద్ధ చేయకుండా తక్షణమే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

- డాక్టర్ నీలవేణిదేవి,
సూపరింటెండెంట్, నర్సీపట్నం

ప్రభుత్వం మారినా మాకేంటి?

చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా

- గత ప్రభుత్వంలో బరి తెగించిన వైసీపీ నేతలే దందా కొనసాగిస్తున్నట్టు ఆరోపణలు
- అధికారులు తమ వారేనంటూ దర్జాగా తవ్వకాలు
- గంగవరంలో లేఅవుట్లను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని అధికారులు


నంగినారపాడు రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో తవ్వకాలు జరిపిన ప్రాంతం

సబ్బవరం, ఏప్రిల్ 27: **అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గంగవరంలో గ్రావెల్ మాఫియా ఆగడాలు తగ్గలేదు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా కొండలు, పొలాలు, జగనన్న కాలనీల్లో గ్రావెల్ తవ్వుకున్న వైసీపీకి చెందిన వారే ఇంకా తమ దందా కొనసాగిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం మారినా అధికారులంతా తమ వారేనని చెబుతూ రేయింబవళ్లు దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారు. గత పదిహేను రోజులుగా ఇష్టానుసారం మట్టి/గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన జగనన్న కాలనీ లేఅవుట్లలో గత రెండేళ్లుగా ధ్వంసం చేస్తున్నా గృహ నిర్మాణ సంస్థ, వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. గంగవరం, నంగినారపాడు జగనన్న కాలనీల్లో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో కాలనీల్లో ఎవరూ లేకపోవడంతో గ్రావెల్ మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాత్రి ... మిగతా 8వ పేజీలో


వెదుల్లనరవ, కొత్తూరు సమీపంలోని దువ్వాడ రెవెన్యూ పరిధిలో గ్రావెల్ నిల్వ చేసిన దృశ్యం

ఏరువాక సాగారో..

కరుణించిన వరుణుడు

- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ
- ఈ ఏడాది ఆలస్యంగా ఖరీఫ్ పనులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. జిల్లాలో అడపాదడపా వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని నారుమడులను సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ పనులు ఆలస్యంగా మొదలయ్యాయనే చెప్పాలి. ఎండలు మండిపోవడం, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ఏడాది జాప్యం జరిగింది.


వ్యవసాయ పనుల్లో రైతు

గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల్లో ఒక మోస్తరుగా, కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా సాగుకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలో వరి సాగు చేపట్టే రైతుల పరిస్థితి ఇటీవల అగమ్యగోచరంగా మారింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా జిల్లాలో వర్షాలు లేకపోగా ఎండలు దంచి కొట్టాయి. కీలకమైన సమయంలో వర్షాలు పడకపోవడంతో నీటి తడులు లేక రైతులు వర్షాలు ఎప్పుడు పడతాయా? అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది జూన్ నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్న రైతులు వ్యవసాయ పనులను ఆలస్యంగా మొదలు పెట్టారు. వరి నారు మడుల తయారీ, ఊడ్పుల పనుల వరకు ఆలస్యంగా వేసుకొని నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది మే నెలాఖరులో ఒకటి రెండు రోజులు జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురిసినా తరువాత వేసవిని మించి ఎండలు మండిపోయాయి. గత వారం రోజులుగా మేఘాలు దోబూచులాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా జిల్లాలో ఎక్కడా కనీసం దుక్కి పనులు కూడా పూర్తి కాలేదు. వర్షాల జాడ లేక వరి నారుమడుల తయారీ పనులు ముందుకు సాగలేదు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం 58 వేల హెక్టార్లలో వరి సాగు విస్తీర్ణం జరుగుతుందని అంచనా వేశారు. ఇందులో పది శాతం అంటే సుమారు 5,800 హెక్టార్లలో ఇప్పటికే వరి నారు మడుల తయారీ జరగాల్సి ఉంది. కానీ వర్షాలు పడకపోవడం, మండుతున్న ఎండల కారణంగా జిల్లాలో కేవలం నీటి తడులు, పంట కాలువలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే కేవలం 210 హెక్టార్లలో వరి నారుమడులు తయారు చేసుకున్నారు. మిగిలిన రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న అన్నదాతలు ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు కష్టమేనని ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు ఊరటనిచ్చాయి. మరికొద్ది రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వరుణుడు కరుణించడంతో జిల్లాలో ఇప్పుడిప్పుడే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. భూములు వర్షపు నీటితో తడవడంతో పల్లపు ప్రాంత పొలాల్లో వరి నారుమడుల తయారీ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. మెట్ట భూముల్లోనూ రైతులు దుక్కి పనులు చేపడుతున్నారు. బోర్లు, సాగునీటి పంట కాలువలున్న రైతులు ఇప్పటికే నారు మడులు తయారు చేసుకోగా, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్ని ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ వర్షాలు పంటల సాగుకు అనుకూలమని, ముఖ్యంగా ఖరీఫ్ వరి సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగ పడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఏరువాకకు సిద్ధం

పాయకరావుపేట రూరల్: మండలంలోని రైతులు ఏరువాకకు సిద్ధమవుతున్నారు. మండలంలో సత్యవరం, పెంటకోట, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెదరాంభద్రపురం, మంగవరం, అరట్లకోట, శ్రీరాంపురం, పాల్తేరు, తదితర గ్రామాల్లో సాగునీటి కాలువలు, చెరువులు, బోర్లు కింద సుమారు మూడు వేల హెక్టార్లలో వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ప్రభుత్వం శ్రీకాకుళం సన్నాలు ఆర్‌జీఎల్ 2537, ఇంద్ర ఎంటీయూ 1061, అమర ఎంటీయూ 1064, బీపీటీ 5204 సాంబా మసూరి, మార్టేరు సాంబా మసూరి, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలను సిద్ధంగా ఉంచింది. బస్తాకు 300 రూపాయలు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్టు ఏవో ఆదినారాయణ తెలిపారు.

జిల్లా అంతటా వర్షాలు


వడ్డాదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు నది

అనకాపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి జిల్లాలో పలు మండలాల్లో మేఘావృతమై చల్లని వాతావరణం నెలకొంది. నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, పరవాడ, సబ్బవరం, అనకాపల్లి, చోడవరం, కోటవురట్ల, మాకవరపాలెం, కశింకోట, మునగపాక, కశింకోట, అచ్యుతాపురం, ఎలమంచిలి, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, రాంబిల్లి మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. పాయకరావుపేట మండలంలో చినుకు జాడ లేదు. జిల్లాలో అడపాదడపా ఒక మోస్తరు వర్షాలతో పాటు అన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఖరీఫ్ వ్యవసాయ పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ఉధృతంగా పెద్దేరు నది

బుచ్చెయ్యపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు పెద్దేరు జలాశయం నీరు కిందకు విడుదల చేయడంతో పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. వడ్డాది వంతెన దెబ్బతినడంతో రవాణాకు ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు నిర్మించిన కాజ్‌వేను తాకుతూ గురువారం పెద్దేరు నది ప్రవహించడంతో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. కాజ్‌వేపై నుంచి పెద్దేరు నది ప్రవహిస్తే బీఎన్ రోడ్డులో రవాణా అస్తవ్యస్తంగా మారుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీని కలిసిన ఎంపీ సీఎం రమేశ్


న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ సీఎం రమేశ్, కుటుంబ సభ్యులు

అనకాపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గురువారం న్యూఢిల్లీలో ఎంపీ సీఎం రమేశ్ కుటుంబ సభ్యులతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మూడోసారి ఎన్నిక కావడంపై సీఎం రమేశ్ అభినందనలు తెలిపారు. శాలువాతో మోదీని సత్కరించారు. సీఎం రమేశ్‌తో పాటు ఆయన సతీమణి శ్రీదేవి, కుమారులు రుత్విక్, రిత్విన్, కోడలు పూజ ఉన్నారు.

క్రైం... crime news

15 కిలోల గంజాయి పట్టివేత

ముంచంగిపుట్టు, జూన్ 27: మండలంలోని కుజబంగి జంక్షన్ వద్ద గురువారం స్థానిక పోలీసులు 15 కిలోల గంజాయితో పాటు ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కుజబంగి జంక్షన్ వద్ద ఏఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేయగా 15 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలను, ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు. పట్టుబడిన స్మగ్లర్లు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చెర్లపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కర్రి శ్రీశైలం, అల్లూరి జిల్లా హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన కొర్రా సీతారాం, ఒడిశా రాష్ట్ర మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ మెట్టగూడ గ్రామానికి చెందిన పాంగి సుంద్రులుగా విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ద్విచక్ర వాహనాలపై గంజాయిని విశాఖపట్నం తరలించేందుకు వారు ప్రయత్నించినట్టు తెలిసిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగేశ్, పడాల్ పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖపట్నం (లీగల్), జూన్ 27: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది గురువారం తీర్పు చెప్పారు. బాధితురాలికి నిందితుడు రూ.లక్ష పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు. దిశా పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మర్రిపాలేనికి చెందిన అప్పన్న (45) విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. 2021 జూలై ఒకటో తేదీన ఓ వీధిలో ఆడుకుంటున్న చిన్నారిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. దిశ పోలీస్ స్టేషన్ అధికారి ప్రేమ్‌కాజల్, డీసీపీ వివేకానంద దర్యాప్తు చేసి కోర్టులో నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నిందితుడు నేరం చేసినట్టు రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.3 లక్షలు పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్‌పై కేసులు

అనకాపల్లి టౌన్, జూన్ 27 : పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నెహ్రూచౌక్, ఎన్టీఆర్ జంక్షన్, రింగురోడ్డు జంక్షన్‌ల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సీఐ పైడపునాయుడు నెహ్రూచౌక్‌లో తన సిబ్బందితో ఎవరైనా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించినా కేసులు నమోదు చేశారు. అలాగే ఎస్ఐలు కూడా సిబ్బందితో ప్రధాన జంక్షన్‌ల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 36 మందిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.23వేలు జరిమానా విధించామని సీఐ పైడపునాయుడు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. మరోసారి ఈ విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పైడపునాయుడు వాహనచోదకులకు స్పష్టం చేశారు.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, జూన్ 27: విశాఖ, సికింద్రాబాద్, తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లతోపాటు విశాఖ మీదుగా బెంగళూరు, న్యూ టిన్సుకియా మధ్య ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-సికింద్రాబాద్-విశాఖ

08579 నంబరు గల రైలు జూలై మూడు నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి బుధవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల రైలు జూలై నాలుగు నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.40 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-తిరుపతి-విశాఖ

08583 నంబరు గల రైలు జూలై ఒకటి నుంచి ఆగస్టు 26 వరకు ప్రతి సోమవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల రైలు జూలై రెండు నుంచి ఆగస్టు 27 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు ఉదయం 10.15 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు

05952 నంబరు గల రైలు జూలై నాలుగు నుంచి అక్టోబరు 31 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మూడో రోజు (శనివారం) మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, ఆ మరుసటి రోజు ఉదయం (ఆదివారం) ఉదయం 9 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 05951 నంబరు గల రైలు జూలై ఎనిమిది నుంచి నవంబరు నాలుగు వరకు ప్రతి సోమవారం 00.30 (ఆదివారం అర్థరాత్రి 12.30) గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి సోమవారం రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

ముత్యాలమ్మపాలెం తీరంలో చేపల మృతిపై విచారణ

- ఉప్పుటేరును పరిశీలించిన ఎన్ఐఓ శాస్త్రవేత్తలు
- నాలుగుచోట్ల నీటి నమూనాలు సేకరణ



స్థానికులతో మాట్లాడుతున్న ఎన్ఐఓ శాస్త్రవేత్తలు, పీసీబీ అధికారులు

పరవాడ, జూన్ 27 : ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరును నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓస్నోగ్రఫీ (ఎన్ఐఓ) శాస్త్రవేత్తలతో పాటు పీసీబీ అధికారులు గురువారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఉప్పుటేరులో భారీ ఎత్తున చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. చేపల మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు ఎన్ఐఓ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంఎస్ కృష్ణ, సీనియర్ సైంటిస్ట్ ఎల్. జగదీషన్, పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు తమ సిబ్బందితో కలిసి ఉప్పుటేరు పరిసర ప్రాంతాల్లో కలియ తిరిగారు. నాలుగు చోట్ల నీటి నమూనాలను సేకరించారు. వీటిని ల్యాబ్‌లో పరీక్షలు జరిపిన అనంతరం చేపలు ఎందువల్ల మృతి చెందాయన్న విషయాన్ని వారం రోజుల్లోగా కారణాలను వెల్లడిస్తామని పీసీబీ ఈఈ తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. గతంలో ఫార్మా కాలుష్యం కారణంగా ప్రజలకు నష్టం వాటిల్లి నేపథ్యంలో నాలుగు ఫార్మా పరిశ్రమలకు రూ.50లక్షలు జరిమానా వేసిన విషయాన్ని ఈ సందర్భంగా పీసీబీ ఈఈ గుర్తు చేశారు. ఈ సంఘటనలో కూడా ఫార్మా పొల్యూషనే కారణమైతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఓ, పీసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ఎన్నాళ్లీ చెట్ల కింద చదువులు

- వర్షాకాలం నాలుగు నెలలు బడికి సెలవే..?
- స్పందించని అధికారులు..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు పూర్తయినా గిరిజన గ్రామాల్లో తప్పని తిప్పలు



చెరకుపల్లిలో చెట్లకింద విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

చీడికాడ, జూన్ 27: మండలంలోని కోనాం శివారు చెరకుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో గిరిజన విద్యార్థులకు ఇప్పటికీ చెట్లు కింద చదువులు తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలు నిర్మిస్తామని, ప్రతి ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తున్న వివిధ పార్టీల నాయకుల హామీలు అమలు కావడం లేదు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడులో నిధులు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో ప్రభుత్వ భవన నిర్మాణాలు పునాదుల వరకే పరిమితమయ్యాయి. చెరకుపల్లి గిరిజన గ్రామంలో 1నుంచి 5వ తరగతి వరకూ 25 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. పాఠశాల నిర్వహణకు సొంత భవనం లేకపోగా గ్రామస్థులు చిన్న కమ్మలపాక నిర్మించారు. వర్షం వస్తే దీనిలో పిల్లలు కూర్చొనేందుకు అవకాశం లేకపోగా ఉపాధ్యాయులు కూర్చొనేందుకు సైతం అవకాశం లేదు. దీంతో వర్షాకాలం నాలుగు నెలల కాలంలో వర్షం వచ్చినపుడల్లా విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పకుండా తమ గృహాలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఉపాధ్యాయులు చేసేది లేక పాఠశాల కాలం పూర్తయ్యేవరకూ గ్రామంలో ఉండి అనంతరం స్వగ్రామాలకు వెళ్లిపోతున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో ఫేజ్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం, వంటషెడ్డు, మరుగుదొడ్డు నిర్మాణానికి రూ.33లక్షలు మంజూరు చేసి, రూ.8.5లక్షల గ్రాంట్ విడుదల చేశారు. ఈ గ్రాంట్‌తో పాఠశాల భవనం పునాది వరకూ స్కూల్ కమిటీ, పాఠశాల హెచ్‌ఎం సంయుక్తంగా నిర్మించగా వంటషెడ్డు, మరుగుదొడ్డి నిర్మాణం శ్లాబువరకూ చేశారు. మిగతా నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పిల్లలకు ఈ ఏడాది కూడా చెట్ల కిందే చదువులు చెప్పవలసిన దుస్థితి నెలకొంది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరహామూర్తిని వివరణ కోరగా..వర్షం వచ్చినపుడల్లా కొంతమంది పిల్లలను కమ్మల పాకలోను, మరికొంతమందిని గ్రామం మధ్యలో చర్చి కోసం నిర్మించిన షెడ్డులో పెట్టి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.



శిథిలావస్థలో ఉన్న పాఠశాల పాక



పునాది వరకే నిర్మించిన పాఠశాల భవనం

అగనంపూడి టోల్‌గేట్‌పై రగడ

- ముదురుతున్న వివాదం
- అగనంపూడి వద్ద టోల్ బూత్‌లు ధ్వంసం
- పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్
- టోల్‌గేట్ నిర్వహణను గడిచిన కొన్నేళ్లుగా వ్యతిరేకిస్తున్న స్థానికులు
- గతంలో హైకోర్టుకు వెళ్లిన గాజువాక బార్ అసోసియేషన్
- న్యాయస్థానంలో తీర్పు సానుకూలంగా రావడంతో టోల్‌గేటు మూసివేత
- కొన్నాళ్లకే మళ్లీ పునరుద్ధరణ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకేనంటున్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- రూ.1200 కోట్లతో నగరంలో 12 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్టు వెల్లడి
- టోల్‌గేట్ తొలగిస్తే ఆ పనులకు బ్రేక్ పడుతుందని వాదన



బూత్‌లు ధ్వంసమైన తరువాత అగనంపూడి టోల్‌గేటు ఇలా..

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి టోల్‌గేట్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. స్థానికులు, కూటమి కార్యకర్తలు టోల్‌గేట్ లేకుండా చేయాలని చూస్తుండగా, కొనసాగించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు యత్నిస్తున్నారు. రెండు రోజుల కిందట స్థానికులు టోల్‌గేట్ వద్ద ఆందోళన నిర్వహించడంతో పాటు స్టాపర్లను తొలగించి, ఫీజు వసూలు చేయకుండా సిబ్బందిని అడ్డుకున్నారు. బుధవారం రాత్రి కొందరు జేసీబీలు, ఇతర యంత్రాలను వినియోగించి టోల్‌గేట్ వద్ద బూత్‌లను తొలగించేశారు. అక్కడ టోల్ గేట్ ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. బూత్‌ల ధ్వంసం చేయడంతోపాటు టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించడంపై పోలీసు అధికారులకు గురువారం ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్ ఫిర్యాదు చేశారు. అదేసమయంలో నేషనల్ హైవే అథారిటీ ఛైర్మన్‌కు కూడా సమాచారం తెలియజేశారు.

వివాదం ఏమిటి..?

అగనంపూడి వద్ద 1997లో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో టోల్‌గేట్‌ను ఏర్పాటుచేశారు. అయితే, గడిచిన కొన్నాళ్లుగా ఈ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో టోల్‌గేట్ ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. ఈ టోల్‌గేట్ వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికంగా భారం మోయాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా గతంలో పోరాటం చేశారు. 2019లో గాజువాక బార్ అసోసియేషన్ టోల్‌గేట్‌ను తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. బార్ అసోసియేషన్ వాదనలను విన్న హైకోర్టు టోల్‌గేటు తొలగింపునకు ఆదేశాలు ఇచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. కొద్దినెలలపాటు టోల్‌గేటును మూసివేశారు. అయితే, హైకోర్టు తీర్పుపై నేషనల్ హైవే అథారిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు టోల్‌గేటును కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు 2019 జూలైలో మళ్లీ పునరుద్ధరించారు. దీనిపై అప్పటి నుంచి స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పూర్తిగా విస్మరించింది. స్థానిక ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదు. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు కూటమి అధికారంలోకి వస్తే టోల్‌గేటును తొలగించేలా చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఎంపీలు సహకారంతో అందుకోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఇదిలావుండగా స్థానికులు, కూటమి నాయకులు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన స్టాపర్లను తొలగించేశారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం రాత్రి పూర్తిగా టోల్‌గేట్‌ను తొలగించేశారు.

ఎన్‌హెచ్ఏఐ అధికారుల వాదన ఇదీ..

స్థానికులు వాదన ఇలా ఉండగా...నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా చెబుతున్నారు. నేషనల్ హైవే నిర్వహణ బాధ్యతను తామే చూస్తున్నామని, ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్నారు. జీ20 సదస్సు నేపథ్యంలో నేషనల్ హైవేపై ఉన్న గుంతలు పూడ్చేందుకు, ఇతరత్రా పనులకు రూ.15 కోట్లు ఖర్చు చేశామంటున్నారు. అలాగే, నగరం నుంచి జాతీయ రహదారి వెళుతున్న నేపథ్యంలో లంకెలపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్, తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం, హనుమంతువాక, పీఎం పాలెం కార్‌షెడ్‌తోపాటు మొత్తం 12 చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ పూనుకుందని, రూ.1200 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెబుతున్నారు. రోడ్ల నిర్వహణతోపాటు బ్రిడ్జిల రిపేర్లు, బస్ బే, లారీ బేల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని. ఇదంతా టోల్ ఫీజు ద్వారా వస్తున్న ఆదాయంతోనే చేస్తున్నట్టు వెల్లడించారు. ఆ టోల్‌గేటును తొలగిస్తే ఈ పనులన్నీ నిలిచిపోతాయంటున్నారు. ఈ టోల్‌గేటు గుండా ప్రతిరోజూ 45 వేల పాసింజర్ వెహికల్ యూనిట్లు (పీసీయు) ప్రయాణిస్తుంటాయని, వీటి ద్వారా రోజుకు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. టోల్‌గేటు తొలగిస్తే రోడ్డు నిర్వహణ నుంచి ఇతర పనులన్నీ నిలిచిపోయే అవకాశముందన్నారు. బుధవారం రాత్రి టోల్‌గేటును పూర్తిగా తొలగించడం వల్ల కోటి రూపాయలకుపైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో బూత్ ఏర్పాటుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించిన విషయాన్ని ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామని, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని స్థానిక అధికారులు వెల్లడించారు.

సొరంగాల నిర్మాణం పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 27: కొత్తవలస, కిరండోల్ లైను (కేకే లైను) అరకు సెక్షన్‌లోని బొడ్డవర, శివలింగపురం స్టేషన్ల మధ్య 1.4 కి.మీ మేర జరుగుతున్న సొరంగ మార్గ నిర్మాణ పనులను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం పరిశీలించారు. మొత్తం ఆరు సొరంగాలలో ఇది నాలుగో సొరంగమని, కాండోలైట్ రాళ్లు, మట్టితో కూడిన ఇసుక రాయి కలిగిన ఈ ప్రాంతంలో సొరంగ నిర్మాణం కఠినంగా మారినా పనులు వేగవంతం చేయడంతో పురోగతి సాధించామన్నారు. ఈ ప్రాంతంలో రైల్వే రవాణా సామర్థ్యం పెంచడంతోపాటు వేగవంతం చేయడానికి దోహదపడుతుందన్నారు. కేకే లైనులో 189 కి.మీ పొడవున డబ్లింగ్ పనులు చేపట్టగా ఇప్పటి వరకు 96.45 కి.మీ మేర పూర్తకాగా, ఆగస్టు నాటికి 100 కి.మీ డబ్లింగ్ పనులు పూర్తయ్యే అవకాశముందన్నారు. సరకు రవాణా కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంలో భాగంగా సొరంగాల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా విశాఖ జిల్లా జేసీ



మయూర్ అశోక్

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బ్యాంకు ఇన్‌చార్జి ఛైర్మన్‌గా ఉన్న కోలా గురువులు ఇరవై రోజుల క్రితం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఏడుగురు సభ్యులతో కూడిన నాన్ అఫీషియల్ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జి కమిటీ రద్దయ్యింది. దాంతో డీసీసీబీలో పాలనాపరమైన ఇబ్బందులు వచ్చాయి. దాదాపు ఇదే సమస్య మిగిలిన జిల్లాల్లో తలెత్తడంతో డీసీసీబీ బాధ్యతలు జేసీలకు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం రూ.50 లక్షలు

అనకాపల్లి టౌన్, జూన్ 27: స్థానిక నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో గురువారం జరిగింది. హుండీల్లో నగదు 50 లక్షల ఒక వెయ్యి 327 రూపాయలను భక్తులు వేశారని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అలాగే 30 గ్రాముల బంగారం, ఒక కిలో 200 గ్రాముల వెండి అమ్మవారికి సమర్పించారన్నారు. హుండీ లెక్కింపు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. హుండీల లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, పూజారులు, శ్రీవారి సేవ సభ్యులు, యూనియన్ బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటాడు. ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు.

గ్రూపు-1 సాధించడమే లక్ష్యం



మాది బుచ్చెయ్యపేట మండలం లైపురం. అమ్మ చనిపోయింది. నాన్న వ్యవసాయం చేస్తుంటారు. లైపురంలో ప్రాథమిక విద్య, రాజాం జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమికోన్నత విద్య అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్, విశాఖ ఏయూలో బీకాం కామర్స్ చదివా. పీజీ సెట్‌లో ఐదవ ర్యాంకు రావడంతో ఏయూలో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో పీజీ చేస్తా. గ్రూప్-1 సాధించడమే నా లక్ష్యం.

\- యాదగిరి సురేశ్,
హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 5వ ర్యాంకు

జియాలజిస్ట్‌ని అవుతా..



మాది చోడవరం పట్టణ శివారు నరసయ్యపేట పంచాయతీ. నాన్న గోవిందరావు శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. అమ్మ నాగలక్ష్మి గృహిణి. పదవ తరగతి వరకు శ్రీ విజ్ఞాన్‌లో, ఇంటర్మీడియట్ విశాఖలో, డిగ్రీ భీమవరం డీఎన్ఆర్ కాలేజీలో చదివా. జియాలజిస్టుగా మంచి పేరు తెచ్చుకోవాలన్నదే లక్ష్యం.

\- ఉగ్గిన సౌమ్య, జియాలజీలో 5వ ర్యాంకు

ఏయూలో ఎంఏ హిస్టరీ చేస్తా..



మాది నర్సీపట్నం. నాన్న లక్ష్మణరావు పెయింటర్‌గా, అమ్మ సరోజిని కూలి పనులు చేస్తుంటారు. పదవ తరగతి వరకు పెదబొడ్డేపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్‌లో, ఇంటర్మీడియట్ విశాఖలో, డిగ్రీ నర్సీపట్నంలోని ఏబీఎం డిగ్రీ కళాశాలలో చదివా. పీజీ సెట్‌లో మూడో ర్యాంకు రావడానికి నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతగానో దోహదపడ్డాయి. ఏయూలో ఎంఏ హిస్టరీ చేయాలని అనుకుంటున్నా.

\- రెడ్డి మోహన్, ఎంఏ(హిస్టరీ) మూడో ర్యాంకు

సైంటిస్ట్‌ను అవుతా..



మాది పాయకరావుపేట. నాన్న షేక్ మస్తాన్ బాషా డక్కన్ కెమికల్స్ ఉద్యోగి. అమ్మ మజిద గృహిణి. గాజువాకలోని చైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో చదివా. లైఫ్ సైన్సెస్‌లో 4వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. సైంటిస్ట్ కావాలన్నదే నా లక్ష్యం.

\- అర్షియా ఆఫీరి షేక్,
లైఫ్ సైన్సెస్‌లో 4వ ర్యాంకు

ఎడ్‌సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ

- ఫిజిక్స్‌లో పాయకరావుపేట విద్యార్థినికి ప్రథమ ర్యాంకు
- బయాలజీ, ఇంగ్లీష్‌లలో నగర విద్యార్థులకు మూడో ర్యాంకు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎడ్‌సెట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు మంచి ప్రతిభచూపారు. ఫిజిక్స్‌లో పాయకరావుపేటకు చెందిన కాశిన వీరసాయి చంద్రిక 100 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించింది. బయాలజీలో సాగర్‌నగర్‌కు చెందిన పప్పల మానస సాయిలక్ష్మి 88 మార్కులతో మూడో ర్యాంకు, భానోజీనగర్‌కు చెందిన సీహెచ్ మేరీ వేలంగిణి 83 మార్కులతో ఏడో ర్యాంకు, ఇంగ్లీష్‌లో నగరంలోని దసపల్లా హిల్స్‌కు చెందిన డి.టాల్కుదర్ 109 మార్కులతో మూడో ర్యాంకు, సబ్బవరానికి చెందిన బి.ఏక్షితనాయుడు 98 మార్కులతో ఆరో ర్యాంకు, సోషల్ స్టడీస్‌లో కోటవురట్ల మండలం కొత్తూరుకు చెందిన ఎం.శ్రావణి 89 మార్కులతో ఆరో ర్యాంకు సాధించారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 27 : జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో సూచించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈనెల 29న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో కోర్టు వారు ఇచ్చిన నివేదిక, జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల్లో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడడానికి అవకాశం ఉన్న కేసుల్లో కక్షిదారులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి లోక్‌అదాలత్ గురించి అవగాహన కల్పించి, వారి సమ్మతితో కేసులు పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని పోలీస్ అధికారులను సూచించారు.

పంచాయతీ శిలాఫలకం ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

అచ్యుతాపురం, జూన్ 27: పంచాయతీ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఇరువాడ పంచాయతీ భవనానికి గతంలో శిలాఫలకం ఏర్పాటుచేశారు. ఈ శిలాఫలకంలో వైసీపీకి చెందిన నాయకుల పేర్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, శిలాఫలకంలో పేర్లు ఎందుకు మార్చలేదంటూ మద్యం మత్తులో ముగ్గురు ధ్వంసం చేశారు. దీంతో సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ఇరువాడకు చెందిన బడితెబోయిన ప్రసాద్, పీతా రాము, రేవిడి దుర్గాప్రసాద్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సీహెచ్ఎన్ అగ్రహారం పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు/అనకాపల్లి రూరల్, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం అనకాపల్లి మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం జనసేన పార్టీ ఐటీ టీమ్ సభ్యులు సమకూర్చిన మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, కూటమి నాయకులు బంటు రవి, దాడి పెంటారావు, శరగడం ఆదిబాబు, భరత్‌బాబు, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

కోటవురట్ల, జూన్ 27: వర్షాలు కురుస్తున్న కారణంగా సీజన్‌వ్యాధులు పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కాశ్వీనాథం, ఎంఈవోలు రామారావు, జోషి, కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ, యూపీ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వివరించారు.

ధ్రువపత్రాల మంజూరులో జాప్యం వద్దు : ఆర్డీవో

కోటవురట్ల, జూన్ 27 : ఏ పని విషయంలోనైనా పేదలను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని నర్సీపట్నం ఆర్డీవో జయరాం వీఆర్వోలను హెచ్చరించారు. గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ క్యాస్టు సర్టిఫికెట్స్‌పై ఆయన విచారణకు వచ్చిన సందర్భంగా వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం చేయవద్దన్నారు. సమగ్రంగా ఇంటింటికీ వెళ్లి విచారణ జరిపి మంజూరు చేయాలని సూచించారు. తూర్పుకాపు సర్టిఫికెట్ల మంజూరుకు తాను ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేనన్నారు. ఈ విషయంలో ఎవరూ ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. అలాగే, పట్టాదారు పాసు పుస్తకాలపై ప్రభుత్వం ఫోటోలు మార్పుచేసే ఆలోచనలో ఉన్నందున ఈ సమయంలో ఎవరికీ పాసుపుస్తకాలు మంజూరు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'కల్కి' విజయోత్సవ సంబరాలు



విజయోత్సవాలు జరుపుకుంటున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, జూన్ 27 : ప్రముఖ సినీ హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం విజయోత్సవాన్ని ఇక్కడి రామచంద్ర థియేటర్‌లో ఆయన అభిమానులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతినిధులు జీవీఎల్ఎస్ రాజు, ఆళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో థియేటర్ వద్ద కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్కి సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదలై చక్కని ప్రేక్షకాదరణ పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కల్కి చిత్రం విడుదలైన సందర్భంగా పెంచిన టికెట్ ధరలను తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, అల్లు రాజు, పి.చలపతి ఇక్కడ విలేకరుల సమావేశంలో కోరారు.

పల్లెలకు జ్వరమొచ్చింది

... 5వ పేజీ తరువాయి

పొందుతున్నారు. నర్సీపట్నం కాపువీధికి చెందిన పినిచెర్ల మహాలక్ష్మి తీవ్రమైన జ్వరంతో బుధవారం ఆస్పత్రిలో చేరారు. గొలుగొండ మండలం కంఠారంకి చెందిన రెల్లి కొండమ్మ తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులతో మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. రావికమతం మండలం టి.అర్జాపురంకి చెందిన విద్యార్థిని ఎ.అశ్విని రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు, దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీజీ సెట్‌లో మెరిశారు

... 5వ పేజీ తరువాయి

4వ ర్యాంకు, సబ్బవరానికి చెందిన కిల్లి అమృత 10 ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో సిగిరెడ్డి మణి 3వ ర్యాంకు, గొలుగొండకు చెందిన సబ్బవరపు పద్మ 12వ ర్యాంకు, నాతవరం మండలం మల్లుభూపాలపట్నానికి చెందిన ఎలిశెట్టి తరుణ్‌కుమార్ 12వ ర్యాంకు, మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన కోరిబిల్లి గౌరీలక్ష్మి 7వ ర్యాంకు సాధించారు. తెలుగు విభాగంలో మాడుగుల మండలం సాగరం గ్రామానికి చెందిన పావర్తి వరలక్ష్మి 6వ ర్యాంకు, గొలుగొండ మండలం జి.కొత్తూరుకు చెందిన గుల్లిపల్లి రమేశ్ 9వ ర్యాంకు సాధించారు.

ప్రభుత్వం మారినా మాకేంటి?

... 5వ పేజీ తరువాయి

వేళల్లో తవ్విన గ్రావెల్/మట్టిని తరలించేస్తున్నారు. వెదుళ్లనరవ, కొత్తూరు,, దువ్వాడ, సంధ్యానగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 50 చోట్లస్టాక్ పాయింట్లు ఉన్న విషయం అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. అక్రమార్కులు ఒక్కొక్కరు రోజుకు కనీసం రూ.50 వేలు విలువ చేసే గ్రావెల్ వ్యాపారం చేస్తున్నారు. లేఅవుట్లలోని ఇళ్ల పునాదులకు అనుకుని రోడ్లు ఉన్నా పట్టించుకోకుండా ఎక్స్‌కవేటర్‌తో తవ్వేస్తున్నారు. గనులశాఖకు స్థానికులు ఫిర్యాదు చేస్తే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వచ్చి తనిఖీ చేసి గ్రావెల్ లారీలు/ట్రాక్టర్లు దొరికితే నామమాత్రంగా జరిమానా విధిస్తున్నారు. ఇందులో గనుల శాఖ సిబ్బంది మామూళ్లు కూడా తీసుకుంటున్నట్టు సమాచారం. కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రావెల్ మాఫియా అగడాలను అడ్డుకోవాలని గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు ప్రజలు కోరుతున్నారు.

రోజంతా ముసురే..

▸▸ చిత్తడిగా మారిన రహదారులు ▸▸ రాకపోకలకు అవస్థలు పడిన జనం
▸▸ 'పేట' మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని టీడీపీ నాయకుడు ఆందోళన
▸▸ గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన బాబూరావు హామీని విస్మరించారని ఆగ్రహం



పాయకరావుపేటలో వర్షం పడుతున్న దృశ్యం



రోడ్డు బైఠాయించిన లెక్కల గోవింద్

పాయకరావుపేట రూరల్/ఎస్.రాయవరం, కోటవురట్ల/నక్కపల్లి : వాతావరణంలో మార్పుల కారణంగా బుధవారం రాత్రి నుంచి పలు మండలాల్లో ముసురు పట్టింది. పాయకరావుపేటలో గురువారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల చిత్రమందిర్ సెంటర్, లక్ష్మీథియేటర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరుచేరి చెరువును తలపించాయి. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు బురదగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై స్పందించిన టీడీపీ నాయకుడు లెక్కల గోవింద్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయడంతో పాటు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ చిత్రమందిర్ సెంటర్‌లో వర్షంలోనే రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు వ్యాజ్యంతో అర్ధంతరంగా నిలిచిపోయిన మెయిన్‌రోడ్డును డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో అభివృద్ధి చేస్తానని చెప్పి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన గొల్ల బాబూరావు నాలుగున్నరేళ్ల కనీసం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా కోరారు. అలాగే, ఎస్.రాయవరం మండలంలోని గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు నెలకొంది. రోజంగా చిరుజల్లులు పడడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లు చిత్తడిగా మారాయి. రైతులు మాత్రం వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లోనూ చిరుజల్లులు పడడంతో రోడ్లు చిత్తడిగా మారాయి.

ఉపాధి పనుల్లో అవకతవకలు

▸▸ గ్రామ సభల్లో వెల్లడించిన అధికారులు



ఈదటంలో గ్రామ సభలో వివరాలు వెల్లడిస్తున్న అధికారి

పాయకరావుపేట రూరల్, జూన్27 : మండలంలోని ఈదటం, గోపాలపట్నం గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామసభల్లో పలు అవతవకలు వెలుగు చూశాయి. ఈదటం గ్రామంలో ఉపాధి పనులలో 54 పనులకు గాను రూ.69,21,776 పనులు జరిగాయని అధికారులు తెలిపారు. 52 పనులకు సంబంధించి సుమారు రూ.55 లక్షల ఉపాధి పనులలో రూ.36 లక్షలు అవతవకలు జరిగినట్లు గుర్తించామని వెల్లడించారు. చెరువులలో జరిపిన పనులలో కొలతలు తేడాలు ఉన్నట్లు, కొబ్బరితోటల్లో చేసిన పనులలో కొలతలు తేడా ఉన్నట్లు తెలిపారు. చెరువు గట్లపైన మొక్కలు నాటినట్లు చూపినా మొక్కలు లేవని తేల్చారు. 115 మంది పనులు చేసినట్లు సంతకాలు, వేలిముద్రలు లేవని, 37 మంది వేతనాల మస్తర్లు దిద్దుబాట్లు గుర్తించినట్లు వెల్లడించారు. అదేవిధంగా గోపాలపట్నంలో జరిగిన గ్రామసభలో ఉపాధి హామీ పనులకు రాని వారికి మస్తర్లు వేసినట్లు వీఆర్పీపై గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. సర్పంచ్ పొలంలో పనులు చేసిన వారికి ఉపాధి పనులు చేసినట్లు మస్తర్లు వేశారని ఆరోపించారు. దీనిపై వాగ్వాదం చోటుచేసుకుంది. వీటి అన్నింటిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ నాగరాజు, డీఆర్పీ స్వామి, ఏపీవో హేమలత, సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, పి.వెంకటరమణ, ఎంపీటీసీ గణసాల పద్మ, టీడీపీ నాయకులు గణపర్తి దొరబాబు, దంతులూరి గోపీరాజు, వెలుగుల బుల్లిబాబు, కోనేటి చంద్రమౌళి, నేమాల సత్యనారాయణ, వీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కొత్తూరు, జూన్ 27: అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు విద్యార్థులంతా తప్పకుండా హాజరు కావాలన్నారు. ఉదయాన్నే యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పూర్తయిన అదనపు తరగతి గదులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం ప్రయోగశాలలను పరిశీలించారు.

నాలుగో తరగతి విద్యార్థులు ఆంగ్లంలో ప్రదర్శించిన రోల్ ప్లేను తిలకించి, వారిని అభినందించారు. ఆమె వెంట మానిటరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, ఏఎంవో పట్నాయక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయి, వసంతరావు, ఉమా, విజయలక్ష్మి, స్వామి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వుషూ పోటీలకు 'గ్లోబల్' విద్యార్థులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

పరవాడ, జూన్ 27 : జిల్లా వుషూ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వుషూ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి గురువారం మాట్లాడుతూ జూనియర్ బాలుర విభాగంలో స్టీఫన్, భార్గవ్, రాహుల్, అభినవ్, యూత్ బోయ్స్ విభాగంలో క్రిష్‌దేవన్, జూనియర్ బాలికల విభాగంలో హిమన్వి పర్మార్, చార్వి, అర్పిత, సమృద్ధి, రోహిణిలు జిల్లా స్థాయిలో చక్కగా ఆడి రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ మేరకు ఆమెతో పాటు సీఈవో నిశాంత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ రమ్య, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరహా నదికి గట్టు నిర్మించాలంటూ జల దీక్ష



అగ్రహారం వరహానదిలో జల దీక్ష చేస్తున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, జూన్ 27 : మండలంలోని వమ్మవరం శివారు విశ్వనాథ అగ్రహారం వద్ద గల వరహానది గట్టును నూతనంగా నిర్మించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం పలువురు గ్రామస్థులు నదిలో జలదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదలకు వరహానది గట్టు దెబ్బతిన్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మళ్లీ వరహానది ఉధృతి పెరిగితే ఉన్న గట్టు మొత్తం పూర్తిగా కొట్టుకుపోయి గ్రామం ముంపునకు గురవుతుందన్నారు. అంతేకాక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయి, పంట పొలాలు సైతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా కోరారు.

'పీటీడీ టోల్ చార్జీలు రద్దు చేయాలి'

అనకాపల్లి టౌన్, జూన్ 27 : ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న టోల్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీటీడీ డీపీటీవో కార్యాలయ అధికారులకు సీపీఐ నాయకులు గురువారం ఇక్కడ వినతిపత్రం అందజేశారు. సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని అగనంపూడి వద్ద ఉన్న టోల్‌గేటును తొలగించినా పీటీడీ బస్సుల్లో టికెట్ చార్జీల్లో టోల్‌ఫీజును తగ్గించకపోవడం తగదన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కోరిబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, మత్తుర్తి సూరిబాబు ఉన్నారు.

సత్యసాయి మందిరంలో చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, జూన్ 27 : గవరపాలెం సత్యసాయి మందిరంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధి డాక్టర్ సూరజ్ ప్రకాష్ జైన్ జయంతి సందర్భంగా నిర్వాహకులు గురువారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ శరగడం నూకరాజు, జయలక్ష్మి కన్వీనర్లుగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర చేతుల మీదుగా పేదలకు వీటిని అందజేశారు. అలాగే సత్యసాయి విద్యా నికేతన్‌లో పదో తరగతి పరీక్షల్లో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన టీచర్లను సత్కరించారు. స్కూల్ హెచ్‌ఎం గౌతమ్, పరిషత్ కార్యదర్శి ఎస్.గోపాలరావు, పిళ్లా నిర్మల, ఆళ్ల ఓంరామ్, కేశవరావు, సత్యసాయి ఆలయ ప్రతినిధులు మళ్ల సాయి, మళ్ల స్వామి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ మంత్రిని కలిసిన గండి బాబ్జీ



సబ్బవరం, జూన్ 27 : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, విశాఖపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలోని విద్యుత్తు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

నక్కపల్లి ఎస్ఐగా సన్నిబాబు



నక్కపల్లి, జూన్ 27 : నక్కపల్లి ఎస్ఐగా సన్నిబాబు నియమితులయ్యారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇతనిని ఇక్కడకు బదిలీ చేయడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఎలమంచిలి రూరల్ ఎస్ఐగా పనిచేశారు.

'శ్రీచైతన్య టెక్నో'లో అపారిశుధ్యంపై అధికారులు అసంతృప్తి





బాత్‌రూమ్‌ని పరిశీలిస్తున్న ఎంఈవో గాంధీ

పాయకరావుపేట, జూన్ 27 : పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో అపారిశుధ్య పరిస్థితులు గురువారం బయటపడ్డాయి. స్కూల్‌ను పరిశీలించిన అధికారులు బాత్‌రూమ్‌లు శుభ్రంగా లేకపోవడంతో పాటు తరతిగదుల్లోకి దుర్వాసన వస్తుండడంతో నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో గురువారం ఆరుగురు విద్యార్థులకు అకస్మాత్తుగా ఊపిరి పీల్చుకోవడంలో సమస్య తలెత్తింది. వెంటనే వారిని సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్ చికిత్సలు అందించడంతో వారు కోలుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎంఈవో కేఎన్ గాంధీ, పీహెచ్‌సీ వైద్యాధికారితో కలిసి స్కూల్‌ను తనిఖీచేశారు. తరగతి గదులను అనుకుని ఉన్న బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు తరగతి గదుల్లోకి దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించి స్కూల్ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ఈ స్కూల్‌ను ఆరు నెలల క్రితం తాను తనిఖీ చేసినపుడు కూడా బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉండడంతో అప్పట్లో హెచ్చరించానన్నారు. అయినా నిర్వాహకుల్లో మార్పు రాలేదని, దీనిపై డీఈవోకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం, జూన్ 27 : మండల కేంద్రం సబ్బవరంలో దుర్గాలమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజామున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు వీబీవీఎస్ఎన్ రాజు, నవనీత్‌వర్మ, టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ కుమారుడు వంశీదీప్, కొటాన అప్పారావు, బాదిరెడ్డి లక్ష్మణ, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, పెద్దాడ రమణమ్మ తదితరులు దర్శించుకున్నారు.

అచ్చియ్యపేటలో మరిడిమాంబ వేడుక

కొత్తూరు, జూన్ 27 : సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో మరిడిమాంబ పండగ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీడీపీ సీనియర్ నాయకుడు రేఖా రమణమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మంత్రుల దృష్టికి నేవీ నిర్వాసితుల సమస్యలు



మంత్రి రవీంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రాంబిల్లి, జూన్ 27 : మండలంలోని వాడనర్సాపురానికి చెందిన టీడీపీ రాష్ట్ర మత్స్యకార అధికార ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ చెల్లూరి దేముడు ఆధ్వర్యంలో పలువురు మత్స్యకార నాయకులు గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వీరాంజనేయులను కలిశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించిన అనంతరం రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్ ఏర్పాటుతో నిర్వాసితులైన మత్స్యకారుల సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని, ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పించాలని, సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని, నేవల్‌బేస్ ఏర్పాటుతో నిర్వాసితులైన కుటుంబాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. కొప్పుగొండుపాలెం మాజీ సర్పంచ్ బద్ది రమణ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సూరాడ దేముడు, మత్స్యకార నాయకులు సూరాడ రాంబాబు, కొవిరి శ్రీను పాల్గొన్నారు.

ఆదిరెడ్డిపాలెం పాల సొసైటీ కార్యవర్గం ఎన్నిక

సబ్బవరం, జూన్ 27 : ఆదిరెడ్డిపాలెం పాల సొసైటీ అధ్యక్షుడిగా ఆదిరెడ్డి రమణ ఎన్నికయ్యారు. గురువారం సొసైటీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా చటికిరెడ్డి అప్పారావు, కొటాన అచ్చిబాబు, గండి వెంకటస్వామి, ఆదిరెడ్డి అప్పారావు, కృష్ణ, కామిరెడ్డి లక్ష్మి ఎన్నికయ్యారు. గ్రామ పెద్దలు కొటాన రాము, ఆదిరెడ్డి పోతుబాబు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, కొటాన అప్పారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

నక్కపల్లి, జూన్ 27 : ఉపమాక గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పిశెట్టి కొండబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు రైతులు పంటలను పండిస్తే సత్ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, కూటమి నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, పాము గణేశ్, తోట అప్పారావు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, శ్రీను, వాసు, దొరబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు'

సబ్బవరం, జూన్ 27 : బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని సహాయ కార్మిక శాఖాధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. గురువారం సీడీపీవో లలితకుమారి, సూపర్‌వైజర్లు స్వర్ణ, పైడితల్లి, సీడ్స్ జిల్లా కో-ఆర్డినేటర్ డేవిడ్‌రాజు, బాల సంరక్షణ అధికారి డి లోవరాజు, ఎస్.ధనుంజయలతో కలిసి సబ్బవరంలోని పలు ఇటుకల తయారీ కేంద్రాలు, దాబాలు, స్వీట్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ ప్రతిమల తయారీ కేంద్రంలో బాల కార్మికుడిచేత పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేశారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : నగేష్

పాయకరావుపేట, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతో పాటు నాయకులు యాళ్ళ వరహాలు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, మలిపెద్ది వెంకటరమణ, లెక్కల గోవింద్, వేములపూడి అప్పారావు, వైసీపీ నాయకుడు జగతా శ్రీను పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పాయకరావుపేట, జూన్ 27 : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 140 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దాసరి రాజ్ కుమార్, కట్టమూరి సురేంద్ర, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపూడి జయప్రకాష్, పి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.నాని సేవలు అందజేశారు.

నర్సీపట్నం నియోజకవర్గం

మొక్కులు తీర్చుకున్న తెలుగు మహిళా నేతలు



ద్వారకా తిరుమల చేరుకున్న నాతవరం తెలుగు మహిళా నేతలు

నాతవరం, జూన్ 27 : మొక్కులు తీర్చుకోవడానికి నాతవరానికి చెందిన మహిళలు గురువారం ద్వారకా తిరుమల చేరుకున్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, నర్సీపట్నం ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు గెలవాలని నాతవరం గ్రామానికి చెందిన 50 మంది మహిళలు ద్వారకా తిరుమలలో ఉన్న వెంకన్నస్వామికి మొక్కుకున్నారు. దీంతో వీరు స్థానిక టీడీపీ నాయకుడు యర్రా కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండల కేంద్రం నాతవరంలో ఎన్నో ఏళ్ళ తర్వాత తమ సమష్టి కృషితో టీడీపీకి 561 ఓట్లు మెజారిటీ వచ్చిందన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

నర్సీపట్నం, జూన్ 27 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సివిల్ జడ్జి పటాన్ షియాజ్ ఖాన్ (సీనియర్ డివిజన్) ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కోర్టు సుముదాయంలో జరిగే లోక్ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంక్ కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, క్రిమినల్, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మునిసిపల్ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న ప్రీ లిటికేషన్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

పలు గ్రామాల్లో వర్షం

గొలుగొండ, జూన్ 27 : పలు గ్రామాల్లో గురువారం వర్షం పడింది. మండలంలోని జోగంపేట, గొలుగొండ, ఏటిగైరంపేట, పాకలపాడు, రావణాపల్లి, చీడిగుమ్మల, గుండుపాల, పాతమల్లంపేట, పుత్తడిగైరంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో వర్షం పడడంతో గెడ్డలు పొంగాయి. పంటపొలాల్లో నీరు చేరింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. పదును అదునుగా ఉండడంతో ముమ్మరంగా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జోరుగా సరుగుడు నాట్లు వేస్తున్నారు.

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్



తాజాగా రంగులు వేసిన తర్వాత అన్న క్యాంటీన్ భవనం

» కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రారంభానికి సన్నాహాలు

నర్సీపట్నం, జూన్ 27 : పేదలకు, రోజు వారీ కూలీలకు రూ.5లకు భోజనం పెట్టిన అన్న క్యాంటీన్ భవనం మళ్లీ జీవం పోసుకుంటోంది. 2019, జనవరి 11న టీడీపీ ప్రభుత్వ హయాంలో అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఇక్కడ అన్న క్యాంటీన్ ప్రారంభమైంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూత పడింది. మూత పడే నాటికి 95 వేల మంది భోజనాలు, 55 వేల మంది అల్పాహారం చేశారు. అన్న క్యాంటీన్ తీసేసిన తర్వాత ఈ భవనంలో రెండున్నరేళ్లు అర్బన్ పీహెచ్‌సీ నడిపారు. ఇప్పుడు అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో గవరవీధిలో నిర్మించిన సొంత భవనంలోకి అర్బన్ పీహెచ్‌సీని తరలించారు. అన్న క్యాంటీన్ భవనం పూర్తిగా నిర్లక్ష్యానికి గురై పాడై పోయింది. పట్టించుకునే నాథుడు లేక డైనింగ్ టేబుళ్లు, వాష్ బేసిన్లు, మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. ఆవరణలో చెత్తా చెదారం పేరుకుపోయింది.

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు తిరిగి జీవం పోసుకుంటున్నాయి. ప్రాంతీయ ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం జూలై 18 తేదీ నాటికి సిద్ధం చేయాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్‌కి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.9 లక్షలతో మరమ్మతు పనులు మొదలు పెట్టారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు ఒక ప్యాకేజీ, రంగులు, మైనర్ రిపేర్లు ఒక ప్యాకేజీ చొప్పున పనులు చేయిస్తున్నారు. గత వారం రోజులుగా చకచకా పనులు జరుగుతుండటంతో అన్న క్యాంటిన్ భవనం సరికొత్తగా మెరిసిపోతోంది.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం, జూన్ 27 : నర్సీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం జరిగిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడుగా మెట్టా ప్రభాకర్, కార్యదర్శిగా అనిమిరెడ్డి శివకృష్ణ, ఉపాధ్యక్షుడు కోసూరి అప్పలనాయుడు, కోశాధికారిగా కె.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.వాసవీదత్త, లైబ్రేరియన్‌గా ఎంవీఆర్ పంతులు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా గోవింద్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డీవీ రమణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాకుళపు వెంకటరమణ ఎంపికయ్యారు. పూర్వపు కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు రావాడ సత్యానారాయణ, లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

ఘనంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం



జోగంపేటలో సీతారాముల ఊరేగింపు

గొలుగొండ, జూన్ 27 : మండలంలోని జానకిరాంపురంలో సీతారాముల ఆలయ నిర్మాణ తృతీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగంపేట, ద్వారకానగరం, శ్రీరాంపురం గ్రామాల్లో ఊరేగింపు చేపట్టారు. శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

కూటమి గెలుపుతో రాష్ట్రానికి మంచిరోజులు

జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు చక్రవర్తి



మాట్లాడుతున్న చక్రవర్తి

కృష్ణాదేవిపేట, జూన్ 27 : కూటమి గెలుపుతో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని జనసేన అనకాపల్లి జిల్లా రూరల్ ఉపాధ్యక్షుడు పూడి చక్రవర్తి అన్నారు. గురువారం గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో మండల ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాల మేరకు పార్టీ మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాకార్యవర్గం సభ్యులు హరినాథ్, అల్లాడ సురేష్, జనసేన సీనియర్ నాయకులు లింగంపేట, పాతకృష్ణాదేవిపేట ఉప సర్పంచులు లంక సత్యనారాయణ, దుంపలపూడి సహదేముడు, నాయకులు చిన్ని, శివాజీ, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో వాగులు, చెరువులు కళకళ



బొడ్డేరుగెడ్డ నీటి ప్రవాహం

కృష్ణాదేవిపేట, జూలై 27 : గొలుగొండ మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొడ్డేరు గెడ్డలు, చెరువులు, వాగులు కళకళలాడుతున్నాయి. ఏఎల్‌పురం, చోద్యం, పాత కృష్ణాదేవిపేట, కొంగసింగి, లింగంపేట, నాగాపురం తదితర ప్రాంతాల్లో చెరువులు, బొడ్డేరు గెడ్డలో ప్రవాహం ఎక్కువైంది.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



బంగార్రాజు దంపతులకు సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

నాతవరం, జూన్ 27 : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి ప్రజల్లో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. హరి పేర్కొన్నారు. గురువారం నాతవరంలో ఉద్యోగ విరమణ చేసిన నాతవరం ఏఎస్ఐ దొంతల బంగార్రాజుకు పోలీసు సిబ్బంది శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.రామారావు, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు జ్వరమొచ్చింది

... 5వ పేజీ తరువాయి

పొందుతున్నారు. నర్సీపట్నం కాపువీధికి చెందిన పినిచెర్ల మహాలక్ష్మి తీవ్రమైన జ్వరంతో బుధవారం ఆస్పత్రిలో చేరారు. గొలుగొండ మండలం కంఠారంకి చెందిన రెల్లి కొండమ్మ తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులతో మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. రావికమతం మండలం టి.అర్జాపురంకి చెందిన విద్యార్థిని ఎ.అశ్విని రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు, దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీజీ సెట్‌లో మెరిశారు

... 5వ పేజీ తరువాయి

4వ ర్యాంకు, సబ్బవరానికి చెందిన కిల్లి అమృత 10 ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో సిగిరెడ్డి మణి 3వ ర్యాంకు, గొలుగొండకు చెందిన సబ్బవరపు పద్మ 12వ ర్యాంకు, నాతవరం మండలం మల్లుభూపాలపట్నానికి చెందిన ఎలిశెట్టి తరుణ్‌కుమార్ 12వ ర్యాంకు, మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన కోరిబిల్లి గౌరీలక్ష్మి 7వ ర్యాంకు సాధించారు. తెలుగు విభాగంలో మాడుగుల మండలం సాగరం గ్రామానికి చెందిన పావర్తి వరలక్ష్మి 6వ ర్యాంకు, గొలుగొండ మండలం జి.కొత్తూరుకు చెందిన గుల్లిపల్లి రమేశ్ 9వ ర్యాంకు సాధించారు.

ప్రభుత్వం మారినా మాకేంటి?

... 5వ పేజీ తరువాయి

వేళల్లో తవ్విన గ్రావెల్/ మట్టిని తరలించేస్తున్నారు. వెదుళ్లనరవ, కొత్తూరు,, దువ్వాడ, సంధ్యానగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 50 చోట్లస్టాక్ పాయింట్లు ఉన్న విషయం అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. అక్రమార్కులు ఒక్కొక్కరు రోజుకు కనీసం రూ.50 వేలు విలువ చేసే గ్రావెల్ వ్యాపారం చేస్తున్నారు. లేఅవుట్లలోని ఇళ్ల పునాదులకు అనుకుని రోడ్లు ఉన్నా పట్టించుకోకుండా ఎక్స్‌కవేటర్‌తో తవ్వేస్తున్నారు. గనులశాఖకు స్థానికులు ఫిర్యాదు చేస్తే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వచ్చి తనిఖీ చేసి గ్రావెల్ లారీలు/ట్రాక్టర్లు దొరికితే నామమాత్రంగా జరిమానా విధిస్తున్నారు. ఇందులో గనుల శాఖ సిబ్బంది మామ్మూళ్లు కూడా తీసుకుంటున్నట్టు సమా చారం. కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రావెల్ మాఫియా అగడాలను అడ్డుకోవాలని గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు ప్రజలు కోరుతున్నారు.

చోడవరం నియోజకవర్గం

ప్రేమసమాజంలో వసతుల కల్పనకు చర్యలు



వసతుల కల్పనకు అనుమతి పత్రం అందిస్తున్న దృశ్యం

చోడవరం, జూన్ 27 : పట్టణంలోని ప్రేమసమాజంలో వసతుల మెరుగుకు చర్యలు చేపడుతున్నట్టు ప్రేమసమాజం జిల్లా అధ్యక్షుడు బుద్ద శివాజీ తెలిపారు. గురువారం కార్యవర్గ సభ్యులు స్థానిక ప్రేమసమాజాన్ని సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. వృద్ధులు పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. ప్రేమసమాజంలోని అవసరమైన వసతులు, భవనాల నిర్మాణానికి అనుమతి మంజూరు చేస్తూ పత్రాన్ని స్థానిక ప్రేమసమాజం ఇన్‌చార్జికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల డేవిడ్, పూసర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు'

చోడవరం, జూన్ 27 : హోటళ్లు, దాబాలలో బాలలను పనిలో పెట్టుకుంటే ఆయా యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక కార్మిక శాఖ సహాయ అధికారి పి. సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన ఇక్కడి హోటళ్లు, దాబాలలో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులు పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్ల యజమానులకు బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉషారాణి, ఏసీడీపీవో పుష్పవతి, సూపర్‌వైజర్ అనిత, సీడ్స్ సంస్థ ప్రతినిధి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

» డిప్యూటీ డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

రోలుగుంట, జూన్ 27 : పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. గురువారం ఇక్కడి ఎమ్మార్సీ భవనంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సాగాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో మెనూ ప్రకారం ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవోలు జగ్గారావు, జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో 'మీ ఇంటికి మీ శాసన సభ్యుడు'

» టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే రాజు

రావికమతం, జూన్ 27 : గ్రామాల్లో ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు త్వరలో మీ ఇంటికి మీ శాసన సభ్యుడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలో టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో గురువారం గర్నికంలో ఏర్పాటైన ఆత్మయ సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ప్రజల నుంచి పుటిన పార్టీ అని, అందుకే ఎల్లప్పుడూ ప్రజాదరణ ఉంటుందన్నారు. వైసీపీ జైలు నుంచి పుట్టిందని, అందుకే ఆ నాయకులను ప్రజలు జైలుకే సాగనంపారని ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీ పాలకులు చేసిన అరాచకాలు తాము చేయబోమన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. తనను ఎన్నికల్లో గెలిపించిన ప్రజలంతా సంతోషంగా ఉండేలా తనవంతు కృషి చేయడంతో పాటు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారాని కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, అర్జాపురం సర్పంచ్ మడగల ఫాల్గుణ, రావికమతం, చినపాచిల ఉప సర్పంచ్‌లు గంజి మోదునాయుడు, కోమటి శంకరరావు, గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు వజ్రపు శివ, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఉప్పులూరి నాగేశ్వరరావు, మరుపాక ఎంపీటీసీ ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట : సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు మల్లాం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, సత్కరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు గొలగాని శ్రీనివాసరావు, రాజారావు, ద్వారపురెడ్డి శంకరరావు, మలిరెడ్డి బుజ్జి, కోటా సత్యనారాయణ, దేవర తాతాజీ, వెలంకాయల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు దృష్టికి ఆర్ఎంపీ వైద్యుల సమస్యలు : బత్తుల



తాతయ్యబాబుకు వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

బుచ్చెయ్యపేట, జూన్ 27 : ఆర్ఎంపీ వైద్యుల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. గురువారం వడ్డాది పార్టీ కార్యాలయంలో బేసిక్ మెడికల్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదిలం బెన్నబాబు, ఆర్ఎంపీ వైద్యులు రైతు ప్రసాద్, వామనమూర్తి, రాయి శ్రీనివాస్, రాందాసు, కృష్ణ, చిన్నబ్బాయి, బావిశెట్టి దొర, బెన్నాబత్తుల శ్రీరామూర్తి, దండి నూకరాజు, శ్రీను తదితరులు ఆయనను కలిశారు. గ్రామీణ ప్రజలకు 24 గంటలు అందుబాటులో వైద్యసేవలందిస్తున్న తమ వైద్యానికి చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని తాతయ్యబాబును కోరారు.

వైసీపీ పాలనలో రైతులకు అన్నింటా అన్యాయం

» కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు



తహసీల్దార్‌కు వినతిని అందిస్తున్న సంఘ నాయకులు

చోడవరం, జూన్ 27 : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంట రుణాలు విరివిగా ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులతో కలిసి గురువారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేట్టారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను ఆదుకుంటామని చెప్పి, వారిని అన్నివిధాలా మోసగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అన్నింటా బాసటగా నిలవాలని కోరారు. పావలా వడ్డీపై రూ.ఐదు లక్షల వరకూ రుణం ఇవ్వాలని, రైతులకు వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు సబ్సిడీ ధరలపై మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఈ సీజన్‌లోనే అందించాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు నాయకులు కిల్లి గణేష్, సబ్బవరపు గణేష్, బొబ్బిలి శంకరరావ, పూలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో వర్షం



దేవరాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

దేవరాపల్లి/ చీడికాడ, జూన్ 27 : వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణం ఉన్నప్పటికీ సాయంత్రం ఆకాశం మేఘావృతమై వర్షం పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. ఇదిలా వుంటే, ఈవర్షాలు సరుగుడు, కూరగాయల పంటలకు మేలు చేకూర్చుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగలు



గుల్లేపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న బండారు

కె.కోటపాడు, జూన్ 27 : మండలంలోని గుల్లేపల్లి, రామయోగి అగ్రహారం, ఎడ్లవానిపాలెం, సిరికివానిపాలెం, కొరువాడ గ్రామాల్లో గురువారం మరిడిమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు జూరెడ్డి రాము, కశిరెడ్డి అప్పలనాయుడు, లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రావికమతం : మండల కేంద్రం రావికమతంలో మరిడిమాంబ పండగను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజాముున అర్చకులు విశేష పూజలు చేపట్టారు. మూడేళ్లకోసారి ఈ వేడుక జరుపుతుండడంతో పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.



రావికమతం మరిడిమాంబ ఆలయం వద్ద..

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో మరిడిమాంబ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, దీవి శంకర్, జీఎస్‌నాయుడు, కొండలరావు, మురళి పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

తాగునీరు కలుషితం కారాదు : ఎంపీడీవో



వరహాపురంలో ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో

చీడికాడ, జూన్ 27 : ప్రజలకు సరఫరా చేసే తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీడీవో జె. ఉమామహేశ్వరి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు వరహాపురంలోని మంచినీటి ట్యాంకులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం పూర్తయ్యేవరకూ ప్రతిరోజు పరిసరాల పరిశుభ్రతపై, మురుగు సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటి వద్ద కాచి చల్లార్చిన నీటిని తాగేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు.

రెల్లి వీధిలో చేతిబోరుకు మరమ్మతులు

కె.కోటపాడు, జూన్ 27 : మండల కేంద్రం కె.కోటపాడు రెల్లివీధిలో పాడైన చేతిబోరుకు గురువారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ బోరు వృథాగా ఉన్న అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో వెనువెంటనే ఎంపీడీవో పట్నాయక్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది వినియోగంలోకి తీసుకు వచ్చారు.

కోనాంలో 25 మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, జూన్ 27 : కోనాం సబ్‌సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 25మంది రోగులను పరీక్షించి, ముగ్గురికి జ్వరం ఉన్నట్టు గుర్తించారు. వీరికి హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట, జూన్ 27 : కొమరవోలు ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శరభవరం, కొంతలం, భోగాపురం, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, అంట్లపాలెం, కంచుగుమ్మల, కొండపాలెం, పడాలపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.